## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- దేశ ప్రజలకు చైత్ర శుక్లాది, ఉగాది, గుడి పడ్వా పండగల సందర్భంగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.
- పర్యావరణ పరిరక్షణపై దేశ ప్రజలు దృష్టి సారించాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అన్నారు.
- పేద ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు.
- బీహార్ లో 800 కోట్ల రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా శంకుస్థాపనలు చేశారు.

=======================

దేశ వ్యాప్తంగా ఈరోజు వివిధ ప్రాంతాలలో చైత్ర శుక్లాది, ఉగాది, గుడి పడ్వా పంగల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వసంత ఋతువును స్వాగతిస్తూ... నూతన సంవత్సర ఆగమనానికి గుర్తుగా జరుపుకునే ఈ పండుగలు భారతదేశ సాంస్కృతిక వైవిధ్యంలో ఐక్యతను సూచిస్తాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. ఈ వేడుకలు ప్రజలలో నూతన శక్తిని, ఉత్సాహాన్ని అందిస్తాయన్నారు. ప్రధాన మంత్రి మోదీ శుభాకాంక్షలు తెలియజేస్తూ.... నూతన సంవత్సరం ప్రజల జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తుందని, అభివృద్ధి చెందిన భారతదేశం కోసం సమిష్టి సంకల్పాన్ని శక్తివంతం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ పౌరులకు ఆరోగ్యం, శ్రేయస్సు కలగాలని ప్రధానమంత్రి ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

=======================

వస్త్ర వ్యర్థాలు ప్రపంచానికి పెద్ద సవాలుగా మారుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈరోజు “మన్ కీ బాత్” కార్యక్రమంలో ఆయన ఈ అంశంపై మాట్లాడుతూ.. మనం ఉపయోగించి వదిలివేసిన వస్త్రాల్లో ఒక శాతం కంటే తక్కువ మాత్రమే రీ సైకిల్ అవుతున్నాయని, అత్యధిక వస్త్ర వ్యర్థాల ఉత్పత్తి చేసే దేశాలలో భారత్ 3వ

స్థానంలో ఉందని చెప్పారు. దేశంలో అనేక అంకుర సంస్థలు పాత వస్త్రాలు, బూట్లను రీసైకిల్ చేసి అవసరమైన వారికి అందిస్తున్నాయని, అలంకార వస్తువులు, హ్యాండ్ బ్యాగ్‌లు, బొమ్మలు వంటివి వస్త్ర వ్యర్థాలతో తయారవుతున్నాయని చెప్పారు. అదేవిధంగా మరో 100 రోజుల్లో యోగా దినోత్సవాన్ని జరుపుకోనున్నామని గుర్తు చేస్తూ... ప్రజలంతా యోగాను తమ జీవితంలో భాగం చేసుకోవాలని చెప్పారు.

(వాయిస్ 29 సెకన్లు)

అదేవిధంగా భారతీయ సంస్కృతిని పరిరక్షించడానికి 75 సంవత్సరాలుగా పనిచేస్తున్న 'సింగపూర్ ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ సొసైటీ" కృషిని అభినందించారు. అలాగే మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో రాజాఖోహ్ గ్రామానికి చెందిన నలుగురు మహిళలు మహువా పువ్వులతో కుకీస్ తయారు చేసి ప్రాచుర్యం పొందిన విషయాన్ని ప్రస్తావించారు.

======================

పర్యావరణ పరిరక్షణపై దేశ ప్రజలు దృష్టి సారించాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న జాతీయ పర్యావరణ సదస్సు ముగింపు సమావేశానికి ఈరోజు ఉపరాష్ట్రపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణ సవాళ్లకు పరిష్కారం చూపడంలో సరిహద్దు దేశాల సహకారంతో పాటు, పర్యావరణ స్థిరత్వం సంరక్షణకు, ఆర్థిక అభివృద్ధిని ఏకకాలంలో ముందుకు తీసుకెళ్లే వినూత్న వ్యూహాలు అవసరమన్నారు. పర్యావరణ సమస్యలను ఒక్క వ్యక్తి, సమూహం, ఏ ఒక్క దేశం స్వయంగా పరిష్కరించలేవని, సమిష్టిగా సాగాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు.

విరామం

======================

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో శాశ్వత శాంతితో కూడిన నూతన యుగం ప్రారంభమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఈరోజు చత్తీస్గడ్ లోని బిలాస్‌పూర్ జిల్లాలోని మొహభట్టలో 33,700 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.... మారుమూల గిరిజన ప్రాంతాలకు రహదారులు, విద్యుత్, మొబైల్ నెట్ వర్క్ సదుపాయాలతో పాటు ఆరోగ్యం, వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో అనేక పాఠశాలలను పునర్ ప్రారంభించామని, గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం "ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్"ను కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. "ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం"లో భాగంగా 3 లక్షల మంది లబ్ధిదారులకు గృహసదుపాయం కల్పించామన్నారు. ఈ సందర్భంగా అబన్పూర్, రాయపూర్ విభాగంలో మెమో రైలు సేవలను ప్రధాన మంత్రి ప్రారంభించారు.

======================

బీహార్ రాష్ట్రంలో 800 కోట్ల రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులు, పథకాలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి సహకార, వ్యవసాయ రంగాలను విస్తృత స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో చెక్కెర మిల్లులను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. మఖానా బోర్డు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సారవంతమైన భూమి, సహకార పథకాలను సద్వినియోగం చేసుకుంటూ.. బీహార్ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మాట్లాడుతూ... కేంద్ర బడ్జెట్ లలో ప్రకటించిన ఆర్థిక సహాయం పట్ల ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

======================

పేద ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈరోజు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్‌కు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.... దేశవ్యాప్తంగా వైద్య కళాశాలలు, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (AIIMS) సంఖ్య ఇటీవలి సంవత్సరాలలో రెట్టింపు అయ్యిందని, మెడికల్ సీట్లు మూడు రెట్లు పెరిగాయని ప్రధానమంత్రి అన్నారు. దీక్ష భూమిని సందర్శించి భారత రాజ్యాంగ నిర్మాతడాక్టర్ బిఆర్ అంబేద్కర్ కు నివాళులర్పించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాగ్‌పూర్‌లోని సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ లో వైమానిక రంగానికి అవసరమైన పలు వసతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

(వాయిస్ 33 సెకన్లు)

========================

బెంగళూరు - గౌహతి మధ్య నడుస్తున్న కామాఖ్య సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలు ఈరోజు ఒరిస్సా లోని కటక్ జిల్లా నెర్గుండి రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు తప్పింది. రైలుకు చెందిన 11 బోగీలు పట్టాలు తప్పి పక్కకు ఒరిగాయి. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం ఈ ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు గాయపడ్డారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన ప్రయాణికులను కటక్ లోని ఎస్సీబీ (SCB) మెడికల్ కళాశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. రైల్వే అధికారులు, వైద్య, ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక బృందాలు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు అందిస్తున్నారు.

========================

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఈరోజు 50 మంది మావోయిస్టులు భద్రత దళాల ఎదుట లొంగిపోయారు. వీరిలో 13 మంది మావోయిస్టులపై 68 లక్షల రూపాయల రివార్డు ఉంది. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడం ఇదే మొదటిసారి. లొంగిపోయిన వారిలో మిలీషియా కమాండర్లు, డిప్యూటీ కమాండర్లు, మావోయిస్టులు ఉన్నారని బీజాపూర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానంలో భాగంగా ఒక్కొక్కరికి 25 వేల రూపాయల చెక్కులను అందించారు. బస్తర్ డివిజన్‌లోని మారుమూల ప్రాంతాలలో భద్రతా శిబిరాలు, రోడ్డు నిర్మాణాలు చేయడంతో పాటు విద్య, ఆరోగ్య సేవలను విస్తరించడం వల్ల ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెరిగిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి అన్నారు. హింసను విడిచిపెట్టి శాంతి మార్గంలోకి తిరిగి వచ్చిన వీరికి పునరావాస కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.

========================
========================